సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



టమాట కిలో రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.35 పలికింది. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



ఆకాశంలో అద్భుతం

ఆకాశంలో అద్భుతం చోటుచేసుకుంది. మంగళవారం చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చి ఆకట్టుకున్నాడు. 8లో

గరిష్టం/కనిష్టం 35.5°/22.4°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

ఎవరికో పేరు వస్తుందని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల నిర్మాణాలను అడ్డుకోవడం అన్యాయం. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఏర్పాటవుతున్న మెడికల్ కళాశాలకు మోకాలడ్డటం నిరుపేద విద్యార్థులకు అన్యాయం చేయడమే. పాలకులు ఎన్నికల వరకే రాజకీయం చేయాలి. అధికారంలో ఉన్నప్పుడు అందరికీ మేలు చేయాలి. ఈ క్రమంలో చంద్రబాబు సర్కార్ రాజకీయాలకు అతీతంగా జగన్ హయాంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల నిర్మాణాలన్నీ పూర్తి చేసి అడ్మిషన్లు కల్పిస్తే వేలాది మంది నిరుపేద విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశం ఉంటుంది.

– కింగ్ మహేష్, పెనుకొండ



మేం మెడిసిన్ చదవొద్దా?

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల ఎందరికో నష్టం జరుగుతుంది. ప్రభుత్వ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి కాబట్టి పేద విద్యార్థులు వైద్య విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. వాటిని ప్రైవేటు పరం చేస్తే పేదవిద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సిందే. ఇకపై ధనికులే వైద్యవిద్యను అభ్యసించే వీలుంటుంది. రాష్ట్రంలో చేపట్టిన మెడికల్ కళాశాలలన్నీ త్వరితగతిన పూర్తిచేసి అదనంగా ఎంబీబీఎస్ సీట్లు తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– కుబ్రా, బైపీసీ విద్యార్థిని, హిందూపురం



న్యూస్‌రీల్

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

కనగానపల్లి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 65 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు...అనంతపురానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి మంగళవారం బొలేరో వాహనంలో 65 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం అందుకొన్న కనగానపల్లి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మామిళ్లపల్లి వద్ద కాపుకాచి వాహనాన్ని పట్టుకొన్నారు. అందులో 65 ప్యాకెట్లు రేషన్ బియ్యం (సుమారు 25 క్వింటాళ్లు) ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించి, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

20న మెగా జాబ్ మేళా

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో 10కిపైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. 18– 35 ఏళ్లలోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9390176421 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి



మాత్రల పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూర, డీఎంహెచ్‌ఓ మంజువాణి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి పరిధిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతోందని, వాటిని నివారించేందుకు 1–19 ఏళ్లలోపు మధ్య వయస్సు కలిగిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను తప్పని ఇవ్వాలన్నారు. జిల్లాలో 1 – 19 ఏళ్ల వయస్సు మధ్య సుమారు 3,81,000 మంది చిన్నారులు ఉన్నారని, తొలిరోజు మంగళవారం 96.98 శాతం మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారన్నారు. మిగతా వారికి ఈనెల 20వ తేదీన మాత్రలు అందజేస్తారన్నారు.

వాచ్‌మెన్ తాగొచ్చి కొడుతున్నాడు!

- జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌కు విద్యార్థుల ఫిర్యాదు

కదిరి అర్బన్: "మేడం మాకు సరిగా చికెన్ పెట్టరు. వార్డెన్‌ను అడిగితే ఆ రోజు రాత్రి వాచ్‌మెన్ తాగొచ్చి మమ్మల్ని కొడతాడు" అంటూ స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర) విద్యార్థులు జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ విజయభారతికి ఫిర్యాదు చేశారు. గురుకుల పాఠశాల నిర్వహణ సరిగా లేదంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మంగళవారం కమిషన్ చైర్ పర్సన్ విజయభారతి గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రతి విభాగాన్ని ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. గడువు దాటిన మందులు, ఎండిపోయిన కూరగాయలను చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ నాయక్, వార్డెన్ దుర్గా ప్రసాద్, వంట మనిషిని కమిషన్ చైర్ పర్సన్ వివిధ అంశాలపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తన తనిఖీలో గుర్తించిన లోపాలను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు పంపి చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు చైర్‌పర్సన్ విజయభారతి తెలిపారు. అంతకుముందు ఆమె పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల) కూడా తనిఖీ చేశారు. ఆమె వెంట డీఈఓ మీనాక్షి, ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ, తహశీల్దార్ మురళీకృష్ణ ఉన్నారు.

నొప్పొస్తే స్టంటే



రొద్దం మండలానికి చెందిన 63 ఏళ్ల వ్యక్తికి నెల రోజుల క్రితం ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబీకులు అంబులెన్సులో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు 'సీరియస్' అంటూ హడావుడి చేశారు. గంటలోపు గుండెకు స్టంట్ వేయపోతే ప్రాణానికే ప్రమాదమని భయపెట్టారు. తమకు ఆరోగ్యశ్రీ ఉందని చెప్పినా... అప్రూవల్ అంత త్వరగా రాదని, ఆలోపు ఏమైనా జరిగితే తమకు సంబంధం లేదని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబం బంధువుల నుంచి రూ.70 వేలు అప్పు తెచ్చి చెల్లించి స్టంట్ వేయించారు.

సోమందేపల్లి మండలానికి చెందిన 46 ఏళ్ల వ్యక్తికి రెండు వారాల క్రితం ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబీకులు హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉందని చెప్పినా..అప్రూవల్ అంత త్వరగా రాదని ఆలోపు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకపోతే అంతే సంగతులంటూ భయపెట్టారు. అయినప్పటికీ ఆ కుటుంబం సదరు వ్యక్తిని అంబులెన్స్‌లో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆరోగ్య శ్రీ కింద వైద్యం చేసి పంపారు.

... జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు రోజుకో చోట చాలా వెలుగు చూస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి 6,575 మంది గుండెపోటుకు గురై.. వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకున్నారు. ఇంకొందరు స్టంట్ వేయించుకోగా.. మరికొందరు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం పొందినట్లు వైద్య, ఆరోగ్య శాఖ, ఆరోగ్య శ్రీ విభాగం గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో నిజమైన గుండెనొప్పులు ఎన్ని అన్నది దేవుడు.. ఆ వైద్యులకే తెలియాలి.

ప్రైవేటు వైద్యుల ఇన్‌'స్టంట్' వైద్యం

- పైసల కోసం అవసరం లేకున్నా ఆపరేషన్లు
- 'ఆరోగ్య శ్రీ' ఉందని చెప్పినా వినిపించుకోని వైద్యులు
- ఎమర్జెన్సీ పేరుతో బంధువులను భయపెడుతున్న వైనం
- స్టంట్ సరిపోయే కేసులకూ నేరుగా బైపాస్ సర్జరీ
- 'ప్రైవేటు' దెబ్బకు అప్పుల పాలవుతోన్న పేదలు

సాక్షి, పుట్టపర్తి

'ప్రైవేటు' వైద్యం పూర్తిగా వ్యాపారంగా మారింది. గుండెపోటు.. రోగులకు చేటు తెస్తోంది. రోగి పరిస్థితి అదుపులో ఉన్నా కాసుల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు ప్రైవేటు డాక్టర్లు హడావుడి చేస్తున్నారు. ఆపరేషన్ చేయడానికి తగినంత సమయం ఉన్నప్పటికీ హడావుడి చేసి అప్పటికప్పుడు డబ్బులు దోచేస్తున్నారు. 'ఆరోగ్యశ్రీ' వర్తిస్తున్నప్పటికీ.. అప్రూవల్ వచ్చేసరికి ఆలస్యమవుతోందని రోగి కుటుంబీకులను భయపెడుతున్నారు. అయినా స్పందించకపోతే 'తర్వాత మీ ఇష్టం' అంటూ బెంబేలెత్తిస్తున్నారు. దీంతో అందరూ ఆపరేషన్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలోని చాలా ప్రైవేటు ఆస్పత్రిల్లో వెలుగు చూస్తున్నాయి. 'ఆరోగ్య శ్రీ' ద్వారా ఆపరేషన్ చేసే అవకాశం ఉన్నా.. ప్రైవేటు వైద్యులు మాత్రం అత్యవసరమంటూ అప్పటికప్పుడు ఆపరేషన్లు చేస్తున్నారు.

పరిస్థితి బాగున్నప్పటికీ..

ప్రమాదకర కరోనా వైరస్ తర్వాత మనుషులు ఉన్నఫలంగా గుండెపోటుకు గురవుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. గుండె నరాల్లో బ్లాకులు ఏర్పడి, స్టంట్ వేయాల్సి రావడం లేదా బైపాస్ సర్జరీ తదితర సమస్యలతో రోగి ఆస్పత్రి మెట్లు ఎక్కితే.. ఎమర్జెన్సీ పేరుతో ప్రైవేటు డాక్టర్లు హడావుడి చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ అప్రూవల్ వచ్చే వరకు ఆగితే ప్రాణాలకే ప్రమాదమని భయపెడుతున్నారు. దీంతో రోగి కుటుంబ సభ్యులు అప్పులు తెచ్చి మరీ ఆపరేషన్ చేయాలని వారే సంతకాలు చేసి ఇస్తున్నారు. వాస్తవానికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించుకుంటే ఎలాంటి ఫీజులు ఉండవు. రోగి కండిషన్ బాగుంటే స్టంట్ వేసి డిశ్చార్జి చేయవచ్చు. అంతకంటే ముందుగా స్టైమి ఇంజక్షన్ చేసి బతికిస్తున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. అయితే ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు రోగులను భయపెట్టి.. గంటల వ్యవధిలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని చెబుతూ ఆపరేషన్ పేరిట 'క్యాష్' చేసుకుంటున్నారు.

రెట్టింపు చార్జీలు వసూలు

ఆరోగ్యశ్రీ కింద ఒక స్టంట్ వేస్తే సుమారు రూ.63,100, రెండు స్టంట్లు వేస్తే రూ.87,237 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అదే ప్రైవేటుగా అయితే ఆస్పత్రుల నిర్వాహకులు ఒక స్టంట్‌కు రూ.2 లక్షలు, రెండు స్టంట్లకు రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ వంటి వాటికి ప్రభుత్వం రూ.1,58,291 వరకు చెల్లిస్తుంది. అందువల్లే కొందరు ప్రైవేటు వైద్యులు రోగి కుటుంబ సభ్యులను కంగారు పెట్టి ఆరోగ్యశ్రీ పని లేకుండా అప్పటికప్పుడు ఆపరేషన్ చేసేస్తున్నారు. రూ.3 లక్షలు మొదలుకుని ఇష్టానుసారం బిల్లులు వేస్తూ దండుకుంటున్నారు.

బాధితులు ఫిర్యాదు చేయొచ్చు

ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు మోసం చేసినట్లు అనుమానం వస్తే.. వెంటనే సమీపంలోని ఆరోగ్య మిత్ర, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ లేదా ఆరోగ్యశ్రీ సీఈఓకు ఫిర్యాదు చేయవచ్చు. విచారణలో ఆస్పత్రి నిర్వాహకులు ఏదైనా తేడా చేసినట్లు తేలితే ఆపరేషన్ ఖర్చుకు 20 రెట్ల ఎక్కువ జరిమానా విధిస్తారు. అంతేకాకుండా ఆస్పత్రి లైసెన్సు కూడా రద్దు చేస్తారు. పరిస్థితిని బట్టి ఆపరేషన్ చేసిన డాక్టర్ డిగ్రీ కూడా రద్దు చేసే అవకాశం ఉంటుంది.

165	రిజిస్టర్డ్ ప్రైవేటు ఆస్పత్రులు
68	జిల్లాలో మెడికల్ ల్యాబ్‌లు
6,575	జనవరి నుంచి గుండె ఆపరేషన్లు

అప్రూవల్ వచ్చే వరకు ఆగాలి



గుండెపోటు వచ్చినప్పుడు ఎమర్జెన్సీ అయితే ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా చికిత్స అందించాలి. ఎమర్జెన్సీ కానప్పుడు ఆరోగ్యశ్రీ అప్రూవల్స్ వచ్చే వరకు ఆగాలి. ఆ పథకం నిరుపేదల కోసం పెట్టినదే. ప్రైవేటు వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పని చేయాలి. 24 గంటల్లోపే అప్రూవల్ వస్తుంది. రోగి పరిస్థితి బాగుంటే వేచి ఉండొచ్చు.

– కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

స్వచ్ఛత వైపు అడుగులు వేద్దాం

- ఆరోగ్యవంతమైన సమాజాన్ని భావి తరాలకు అందిద్దాం
- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా అందరూ స్వచ్ఛతవైపు అడుగులు వేద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొత్తచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వరకూ సాగింది. అనంతరం కళాశాల పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామగ్రామానా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రగతికి కృషి చేసిన వారిని గుర్తించి పూలమాలలు, శాలువాలతో సత్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివకుమారి, మండల ప్రత్యేక అధికారి శివరంగప్రసాద్, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సర్పంచ్ రాధా, పంచాయతీ సెక్రటరీ సురేంద్రరెడ్డి, ఎంపీడీఓ బారెన్ సాహెబ్, ఎంఈఓ జయచంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పీఎంఏవైతో పేదల సొంతింటి కల సాకారం

ప్రశాంతి నిలయం: నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తామని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఈ క్రమంలో అర్హులందరికీ ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం (పీఎంఏవై) అందేలా చూస్తామన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఒడిశాలో ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చేతన్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పీఎంఏవై పథకం కింద పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 8, 5, 14, 15, 11 వార్డులకు చెందిన పలువురు బ్రాహ్మణపల్లి హౌసింగ్ లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోగా, వారందరికీ ఇళ్ల తాళాలు అందజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డీఈ రమణారెడ్డి, ఏఈ ప్రవల్లిక, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కమిషనర్ విధులకు రావొద్దు!

- ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌కు తెలుగు తమ్ముళ్ల అల్టిమేటం
- మున్సిపల్ కార్యాలయంలో రోజంతా హైడ్రామా
- పోలీసులు సర్దిచెప్పినా వినిపించుకోని టీడీపీ నేతలు
- కార్యాలయానికి రావొద్దంటూ కమిషనర్ మల్లికార్జునకు పోలీసుల ఉచిత సలహా




మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల హల్‌చల్ (ఇన్‌సెట్‌లో) మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అంతా తాము చెప్పినట్లే జరగాలంటూ అధికారులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. ధర్మవరంలో ఈ పరిస్థితి మరింత పెరిగిపోయింది. ఏకంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను తెలుగు తమ్ముళ్లు టార్గెట్ చేశారు. ఆయన విధుల్లోకి రావొద్దంటూ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నానా రచ్చ చేశారు. కమిషనర్ మల్లికార్జునకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

పరిటాల శ్రీరాం అనుచిత వ్యాఖ్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునను ఉన్నతాధికారులు నియమించారు. ఆయన గతంలోనూ ధర్మవరంలో పనిచేశారు. నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ అక్రమార్కుల ఆట కట్టించారు. దీంతో తిరిగి ఆయన ధర్మవరానికి వస్తుండటాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. మల్లికార్జున మున్సిపల్ కమిషనర్‌గా వస్తే తమ ఆటలు సాగవని భావించిన ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాం కార్యకర్తల సమావేశంలో కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కూడా కార్యకర్తలను రెచ్చగొట్టారు. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని హంగామా చేశారు. కమిషనర్ మల్లికార్జునకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్ర, టూటౌన్ సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తెలుగు తమ్ముళ్లకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు కార్యాలయ ప్రాంగణం నుంచి వెళ్లేందుకు అంగీకరించలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయ ఆవరణలో నినాదాలు చేస్తూ ఉండిపోయారు. దీంతో ఏం చేయాలో తెలియని పోలీసులు చివరకు కమిషనర్‌కు ఫోన్ చేసి కార్యాలయానికి రావొద్దంటూ ఉచిత సలహా ఇచ్చారు. అయితే ప్రభుత్వం అధికారికి రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఇలా చేతులెత్తేయడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. టీడీపీ కార్యకర్తలు, నేతల అతి చేష్టలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. నిజాయితీగా ఉండే అధికారులు ధర్మవరంలో పనిచేయకుండా ఇలా.. నిరసనలు తెలిపితే భవిష్యత్‌లో ఏ అధికారీ ధర్మవరం రావడానికి ఇష్టపడరని అంటున్నారు. అధికారులకు పార్టీలను అంటగట్టే వైఖరి తగదని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు హితవు పలికారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు

రాజకీయాలు ఆపాదించొద్దు

ఈ విషయమై 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో మాట్లాడగా...ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను సాధారణ బదిలీల్లో భాగంగానే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ధర్మవరానికి బదిలీపై వచ్చానన్నారు. తాను ఏ పార్టీకి మద్దతుగా గానీ, వ్యతిరేకంగా గానీ ఇంతవరకు పని చేయలేదన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు నిరసన తెలపడం తనని ఎంతో బాధించిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ధర్మవరంలో పని చేయడం తన విధి అని, అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



బత్తలపల్లి కూడలిలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

- బత్తలపల్లి ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి
- నెలరోజులైనా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాగ్రహం
- వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్

బత్తలపల్లి: కార్మికుల సమ్మెతో మండలంలో సత్యసాయి నీరు సరఫరా నిలిచిపోవడం, పంచాయతీ నీరు కూడా రాకపోవడంతో బత్తలపల్లి ఎస్సీ కాలనీ, యల్లమ్మ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో మంగళవారం కాలనీలోని మహిళలు బత్తలపల్లి కూడలికి చేరుకుని ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకుని కూడలి వద్దకు చేరుకున్న ఏఎస్‌ఐ సోమశేఖర్ మూర్తి, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు మహిళలకు నచ్చజెప్పి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు వద్దకు వెళ్లాలని సూచించారు. దీంతో వారంతా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఖాళీ బిందెలతో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడం, పంచాయతీ మోటార్లు మరమ్మతులకు గురవడంతో నెలరోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీనికి తోడు గ్రామాల్లో చేతి పంపులు పనిచేయకపోవడం, స్కీం బోర్లలో నీరు లేక కష్టాలను ఎదుర్కొంటున్నామన్నారు. కనీసం చిన్న పిల్లలకు స్నానం కూడా చేయించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. స్పందించిన ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమంలో మాతంగి కాశమ్మ, అలివేలమ్మ, నాగేంద్రమ్మ, నారాయణమ్మ, మీనుగ పుల్లమ్మ, చీమల నారాయణమ్మ, లక్ష్మీదేవి, పెద్దక్క, పుష్పావతి, ఓబులమ్మ, కుళ్లాయప్పతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఈఓఆర్డీ దివాకర్‌కు తాగునీటి సమస్య వివరిస్తున్న మహిళలు

అంధకారంలో వైద్య విద్య



వచ్చే ఏడాది ప్రారంభం కావాల్సిన పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం అడ్డుకుని వైద్య విద్యను అంధకారంలోకి నెట్టేసింది. వైద్య విద్యను పేదలు అభ్యసించకూడదనే ధోరణి సీఎం చంద్రబాబులో వ్యక్తమవుతోంది. మా ప్రాంతంలోనూ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటవుతుందని ఎదురు చూస్తున్న మా ఆశలపై నీళ్లు చల్లారు. కేవలం జగనన్నకు మంచి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతోనే కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. రానున్న రోజుల్లో ఇది ప్రజా ఉద్యమాలకు దారి తీయడం ఖాయం.

– గోపాలరెడ్డి, రాంపురం, పెనుకొండ మండలం



పేదల ఆశలపై నీళ్లు



రాష్ట్రంలో నూతనంగా 17 మెడికల్ కళాశాలలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు సాధించడంతో వైద్య విద్యను అభ్యసించాలనే చాలా మంది పేద విద్యార్థులు తపన పడ్డారు. ఈ క్రమంలోనే బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నెల్లూరుకు వెళ్లి రూ.లక్షలు వెచ్చించి నీట్ కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే వారి ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. మెడికల్ కళాశాలలను నిర్వహించలేమంటూ చేతు లెత్తయడం సీఎం చంద్రబాబు చేతకాని తనానికి నిదర్శనం.

– శేషాద్రి, పెనుకొండ

క్లుప్తంగా

వంగపేరులో కూలిన రక్షణ గోడ



కూలిపోయిన రక్షణ గోడ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కొట్లపల్లి సమీపంలో ఉన్న వంగపేరు బ్రిడ్జి రక్షణ గోడ కూలిపోయింది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈ రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గాజులపల్లి చెరువు మరువ పోవడంతో వంగపేరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో శిథిలావస్థలో ఉన్న రక్షణ గోడ మంగళవారం కుప్పకూలింది. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిపై సంచరించే వాహనాలు అదుపు తప్పితే దాదాపు 25 అడుగుల లోతైన గోతిలో పడే ప్రమాదం నెలకొంది. అంతేకాక బ్రిడ్జి దెబ్బ తింటే నిడిమామిడి, ఐరగరాజుపల్లి, గాజులపల్లి, దండువారిపల్లి, కత్తివారిపల్లి, శెట్టిపల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

పుట్టపర్తి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రం కొత్తచెరువులోని ఇసుకవంక వీధిలో నివాసముంటున్న ఈశ్వరమ్మకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భార్గవ్ (29)కు అదే గ్రామానికి చెందిన అనూషాతో వివాహమైంది. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని భార్గవ్ పోషించుకునేవాడు. ఈ క్రమంలోనే భార్గవ్‌తో పాటు డ్రైవర్‌గా పనిచేస్తున్న వడ్డే శ్రీనివాసులు అలియాస్ విశాఖ పట్నం శ్రీనివాసులతో అనూషా వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పద్ధతి మార్చుకోవాలని దండించారు. అయినా తీరు మార్చుకోకుండా ఆమెతో కలసి తిరుగుతున్న శ్రీనివాసులపై బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 14న కొత్తచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న శ్రీనివాసులు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో కొత్తచెరువు సర్కిల్‌లోని పెనుకొండ రోడ్డులో భార్గవ్‌ను అడ్డుకుని దుర్భాషలాడాడు. ఎవరు చెప్పినా తాను వినేది లేదని, అనూషాను ఎలాంటి పరిస్థితుల్లోనూ వదిలి పెట్టేది లేదంటూ అందరి ముందు ఘర్షణ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన భార్గవ్ అదే రోజు ఆత్మహత్యాయత్నం చేయడంతో సకాలంలో కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లి బతికించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరిగి భార్గవ్‌ను చూసి శ్రీనివాసులు హేళనగా మాట్లాడాడు. దీనిపై పోలీసులకు భార్గవ్ ఫిర్యాదు చేస్తే అక్కడ న్యాయం జరగకపోగా... పోలీసులే దండించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన నేరుగా ఇంటికి చేరుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



చంద్రుడు వస్తున్న వేళ అరుణ వర్ణంతో మెరిసిపోతున్న ఆకాశం



మబ్బుల్ని చీల్చుకుంటూ పైకి వస్తున్న చంద్రుడు

● ఆకాశంలో అద్భుతం

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. మంగళవారం రాత్రి 7 నుంచి 7.30 గంటల మధ్యలో భూమికి దగ్గరగా చంద్రుడు కనిపించి ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది వరుసగా సంభవించే నాలుగు సూపర్ మూన్‌లలో ఇది రెండవది కావడం గమనార్హం. అతి పెద్దగా, అత్యంత ప్రకాశవంతంగా కనిపించిన చంద్రుడిని చూస్తూ మైమరిచిన పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించి సంబరపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అతి పెద్దగా కనిపిస్తున్న చంద్రుడు

పరిమళించిన మానవత్వం

ఎన్పీకుంట: మానవత్వం పరిమళించింది. అరుదైన జబ్బు బారిన పడిన విద్యార్థినిని ఆదుకునేందుకు పలువురు ముందుకొచ్చారు. న్యూరోజెనిక్ వ్యాధితో బాధపడుతున్న పెడబల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని షమీమ్ దుస్థితిపై ఈ నెల 14న 'కన్నీళ్లకే కష్టాలొచ్చే' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై కదిరికి చెందిన ఉపాధ్యాయ దంపతులు తస్లీమ్, హనీఫ్ ఖాన్ స్పందించి తమిళనాడులోని పుదుచ్చేరిలో ఉన్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మెర్)లో పనిచేస్తున్న తమ కుమారుడు న్యూరో సర్జన్ రుమాన్ పఠాన్‌తో సంప్రదించారు. ఆయన సూచన మేరకు పాఠశాలకు సెలవు పెట్టి షమీమ్‌ను పిలుచుకెళ్లి సోమవారం రాత్రి జిప్‌మెర్‌లో అడ్మిట్ చేయించి వచ్చారు. షమీమ్ పూర్తిగా కోలుకునేలా చికిత్సలు అందజేయాలని అక్కడి వైద్యులను అభ్యర్థించారు. కాగా, షమీమ్ చికిత్సకు రూ.4 లక్షలకు పైగా అవసరం కాగా, ఇప్పటి వరకూ 'సాక్షి' కథనానికి స్పందించిన దాతలు... ఫోన్‌పే (91828 85369), బ్యాంకు అకౌంట్ (ఏపీజీబీ ఖాతా నెంబరు: 1909 454 9235, ఐఎఫ్‌ఎస్‌సీ : ఏపీజీబీ0001064)కు రూ.1.50 లక్షలు జమ చేశారు. తన కుమార్తెను బతికించేందుకు స్పందిస్తున్న దాతలకు ఈ సందర్భంగా షమీమ్ తల్లి ఖాజాబీ కృతజ్ఞతలు తెలిపింది.



పుదుచ్చేరిలోని ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన తర్వాత షమీమ్‌కు ధైర్యం చెబుతున్న ఉపాధ్యాయురాలు తస్లీమ్

సాక్షి ఎఫెక్ట్..

150 అరటి మొక్కల నరికివేత

పుట్లూరు: మండలంలోని కుమ్మనమల గ్రామంలో మంగళవారం రైతులు ఓబుళకొండయ్య, శ్రీనివాసులకు చెందిన అరటి తోటల్లో 150 మొక్కలను దుండగులు నరికి వేశారు. విషయాన్ని గుర్తించిన రైతులు వెంటనే ఎస్‌ఐ హేమాద్రికి సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాల కోసం అన్వేషించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- పుట్టపర్తిలో పడకేసిన పారిశుద్ధ్యం
- శివారు కాలనీల్లో ఎటు చూసినా చెత్తా చెదారం
- విజృంభిస్తున్న రోగాలు
- ఇటీవల అనారోగ్యంతో బాలుడి మృతి



సాయి నగర్‌లో డ్రైనేజీ దుస్థితి



సాయి నగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం

పుట్టపర్తి అర్బన్: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ఖ్యాతిగాంచిన పుట్టపర్తిలో ఎటు చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. రోడ్ల పక్కన చెత్తాచెదారం, మురుగు నీళ్లు, కొబ్బరి బొండాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం నిర్వహణ పూర్తిగా అటకెక్కడంతో ఆయా ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్‌కు, సిబ్బందికి మధ్య సఖ్యత లేకపోవడంతో పాలన గాడి తప్పింది. దీంతో పారిశుధ్య కార్మికులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చెత్త తరలింపును నిర్లక్ష్యం చేశారు. ఇటీవల కొత్తగా మున్సిపల్ కమిషనర్‌గా ప్రహ్లాద బాధ్యతలు తీసుకున్నా పాలన గాడిలో పడలేదు. ఇక నూతన ఎమ్మెల్యే సభలు, సమావేశాలకు తప్ప ఇతరత్రా అంశాలను పట్టించుకోకపోవడంతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాల్సిన చోట దుర్గంధం వ్యాప్తి చెందుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



పుట్టపర్తి ఉన్నత పాఠశాల పక్కన గుట్టలుగా పడేసిన ఖాళీ కొబ్బరి బోండాలు

పెరిగిన రోగుల సంఖ్య

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి నిల్వలు పెరిగిపోయాయి. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. ఫలితంగా దోమకాటు రోగాలు ప్రబలి ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజూ వందల సంఖ్యలో రోగులు చేరుకుంటున్నారు. 150 నుంచి 200 మంది వరకూ రోగులు కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, డెంగీ, మలేరియా రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. 104 వాహనం వద్దకు ప్రతి గ్రామంలోనూ 100కు పైగా కేసులు వస్తున్నాయి.

ఇబ్బందుల్లో శివారు కాలనీ వాసులు

పుట్టపర్తి శివారు కాలనీలైన సాయి నగర్, కమ్మవారి పల్లి రోడ్డు, కర్ణాటక నాగేపల్లి, చిత్రావతి, వివేకానంద నగర్, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, ప్రశాంతిగ్రామం వంటి ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించి వ్యాధులు తీవ్రత పెరిగింది. ఇటీవల సాయినగర్ సమీపంలో నివాసముంటున్న ఓ బాలుడు విషజ్వరం బారిన పడి మృతి చెందిన విషయం తెలిసిందే. సాయి నగర్‌లో డ్రైనేజీ కాలువ శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోతోంది. పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ కొబ్బరి బోండాలు తాగి పడేస్తుండడంతో వర్షం నీళ్లు నిలబడి దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అందులో పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పుట్టపర్తి పట్టణ శివారు ప్రాంతాల్లో పర్యటించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపడతాం. కొబ్బరి బోండాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్న వారిని పిలిపించి హెచ్చరిస్తాను. మురుగు నీళ్లు ఎక్కడ ఉన్నా తొలగిస్తాం, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రశాంతినిలయం ముఖ ద్వారం వద్ద నుంచి విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి రథాన్ని చేర్చారు. ఉత్సవంలో దేశవిదేశీ భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత తోటలో పైపులైన్ల ధ్వంసం

బత్తలపల్లి: మండలంలోని వెంకటగారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు తోటలో పైప్‌లైన్లను దుండగులు ధ్వంసం చేశారు. ఆదివారం గ్రామంలోని శ్రీనివాసులు ఇంటిపై టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ దాడి చేసిన విషయం తెలిసిందే. మంగళవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో మోటారు ఆన్ చేయగా నీరు పొలానికి పారకపోవడంతో రైతు పరిశీలించి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. ఆదివారం జరిగిన దాడులకు సంబంధించి టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు సోమవారం వైఎస్సార్‌సీపీ వర్గీయులు అరవింద్, అప్పస్వామి, గంగాధర్, వెంకటరాముడును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అయితే దాడికి పాల్పడిన వారిని కాకుండా దాడికి గురైన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనికి తోడు కేసుల భయంతో పలువురు గ్రామంలో లేకుండా పోయారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నేతలు పక్కా పథకం ప్రకారం శ్రీనివాసులు తోటలో పైప్‌లైన్లను ధ్వంసం చేసినట్లుగా ఆరోపణలు వినవస్తున్నాయి.

వివాహితపై అత్యాచారం

చిలమత్తూరు: మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వివాహిత(24) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన శశివర్ధన్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు జరిగిన దారుణాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

అక్రమ మద్యం పట్టివేత

అమడగూరు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 286 టెట్రా ప్యాకెట్లు, తొమ్మిది ఫుల్ బాటిళ్ల మద్యంను అమడగూరు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న షేక్ బాబావలిని అరెస్ట్ చేసి ఆటోను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ముదిగుబ్బ: మండలంలోని కొండగట్టుపల్లి సమీపంలో మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్యామారావు తెలిపారు. పట్నం ఎస్‌ఐ నరసింహుడు, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ముగ్గురు వ్యక్తులు సంచి పడేసి పారిపోతుండగా కానిస్టేబుళ్లు వెంటాడి అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరి నుంచి 315 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరుకు చెందిన ఇలియాజ్ అహమ్మద్ (36) వ్యాపారం నిమిత్తం మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై అనంతపురానికి వెళుతుండగా కొడికొండ చెక్‌పోస్టు వద్ద వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇలియాజ్ అహమ్మద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిలమత్తూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు ఎద్దులపల్లికి చెందిన ఆదినారాయణ (50) 'లో బీపీ'తో బాధపడుతూ మంగళవారం ఆ గ్రామ ఆర్‌ఎంపీ వద్దకు చికిత్స కోసం వెళ్లాడు. ఆ సమయంలో ఇంజక్షన్ వేసిన కొద్ది సేపటికే తీవ్ర అస్వస్థతకు లోనైన ఆదినారాయణను కుటుంబసభ్యులు హుటాహుటిన పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య చౌడమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంచాయతీ మోటారు కేబుల్, స్టార్టర్ల చోరీ

బత్తలపల్లి: మండలంలోని ఓబుళాపురం పంచాయతీ పరిధిలో తాగునీటి పథకానికి సంబంధించిన మోటారు కేబుల్, స్టార్టర్లను దుండగులు అపహరించుకెళ్లారు. ఓబుళాపురం పంచాయతీ పరిధిలోని కోడేకండ్ల, రామాపురం గ్రామాల వద్ద పంచాయతీ తాగునీటి పథకానికి సబంధించి మూడు బోర్లు ఉన్నాయి. సోమవారం రాత్రి విద్యుత్ లైన్ నుంచి మోటార్ వరకూ లాగిన రూ.20వేలు విలువ చేసే కేబుల్ వైర్‌తో పాటు స్టార్టర్లను దుండగులు అపహరించుకెళ్లారు. దీంతో మంగళవారం ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కాగా, బత్తలపల్లిలోనూ వారం రోజుల క్రితం వ్యవసాయ బోరు బావుల వద్ద దాదాపు పది మంది రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్ల కేబుల్ వైరును దుండగులు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బెళుగుప్ప: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బెళుగుప్ప పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం మీడియాకు ఎస్‌ఐ శివతో కలసి సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. బెళుగుప్ప మండల పరిధిలోని పలు ఇళ్లలో ఇటీవల జరిగిన చోరీ కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం గుండ్లపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకలోని హావేరి జిల్లా రాణిబెన్నూరుకు చెందిన బోయ పరుశురాంను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో చోరీ కేసులు వెలుగు చూశాయి. జల్సాలకు అలవాటు పడిన పరుశురాం పలు దొంగతనాల కేసుల్లో పట్టుబడి కర్ణాటకలోనే జైలు జీవితం గడిపాడు. ఈ ఏడాది జూన్‌లో విడుదలై వచ్చిన వెంటనే జూలై, ఆగస్టు మాసాల్లో కళ్యాణదుర్గం, ఉరవకొండ, కర్నూలు జిల్లా ఆలూరు, బెళుగుప్ప మండలంలో పలు చోరీలకు పాల్పడ్డాడు. నిందితుడి నుంచి 40 గ్రాముల బంగారు నగలు, రూ.27వేల నగదు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పత్తిలో తెగుళ్ల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దవడుగూరు/పామిడి/బుక్కరాయసముద్రం: పత్తి పంటలో తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్‌నాయక్, డాక్టర్ కిషోర్ రెడ్డి, ఆత్మ పీడీ మద్దిలేటి సూచించారు. డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్ అధికారి శైలజ, జిల్లా రైతు శిక్షణా కేంద్రం అధికారి శ్రీనివాసులుతో కలసి మంగళవారం పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, పామిడి, నీలూరు, దిమ్మగుడి, చిట్టూరు తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. కొర్ర, పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా బెట్టను పత్తి పంట తట్టుకునే చర్యలను వివరించారు. ఒక లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం, 3 గ్రాముల బోరాన్ మిక్చర్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు పది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంది పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, పామిడి ఏఓ లీనా, విస్తరణ అధికారి ప్రసాద్, ఆర్‌ఎస్‌కే రామచంద్ర , రైతులు సిబ్బంది పాల్గొన్నారు.